బాలవిజ్ఞానం

2. రంగు రంగుల కిరణాలు

—శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

కాంతి తరంగాలుగా ప్రసారమవుతుందని తెలుసుకున్నాం. ఈతరంగాలనిడివి మారుతుంది. ఈ మార్పునుబట్టే కాంతిలో రంగులుకూడా ఉంటాయి. కాంతితరంగాలనిడివి ఒకప్రమాణానికి మించినా, మరొకప్రమాణానికి తగ్గినా వాటిని మన కన్ను చూడలేదు. మన కన్ను చూడగల అతి పెద్ద తరంగాలు అంగుళానికి 30 వేలుంటాయి; అంతకన్న పెద్దతరంగాలను మన చర్మం వేడిరూపంలో గ్రహించగలదు గాని, కన్ను చూడలేదు. అంగుళానికి 30 వేల తరంగాలుండే కాంతి మన కంటికి ఎర్రగా కనిపిస్తుంది. అంతకన్న పెద్ద తరంగాలను – వేడి కిరణాలను– ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలు అంటారు; అంటే "ఎరుపుకు దిగువ" కిరణాలు అని అర్థం. మనం నెత్తుటిగడ్డలకు కాపడం పెట్టుకునేటప్పుడు ఈ కిరణాలనే ప్రయోగిస్తామన్నమాట. ఇప్పుడు డాక్టర్లదగ్గిరా ఆస్పత్రులలోనూ ఈ కిరణాలను ప్రసారముచేసి చికిత్స చేసే పరికరాలుంటున్నాయి.

మన కన్ను చూడగల అతి చిన్న కాంతితరంగాలు అంగుళానికి 60 వేలుంటాయి. అంటే ఇది ఎరుపు కాంతి తరంగాల నిడివిలో సరిగా సగం ఉంటాయన్నమాట. ఇలాంటి తరంగాలతో కూడిన కాంతి మన కంటికి ఊదారంగుగా కనిపిస్తుంది. దీనికన్న చిన్న తరంగాలు గల కిరణాలను "అల్ట్రా వయొలెట్", లేక "ఊదాకు ఏగువ" కిరణాలు అంటారు. సూర్యకాంతిలోగల ఈ "అల్ట్రా వయొలెట్" కిరణాలు మన శరీరంలో "డి" విటమినును ఉత్పత్తి చేస్తున్నాయి. మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నాయి. ఈ కిరణాలకు సూక్ష్మక్రిములను నాశనంచేసే శక్తికూడావున్నది. ఈ కిరణాలనుకూడా చికిత్సకూ పరిశ్రమలలోనూ వాడతారు.

సూర్యకాంతి మనకు తెల్లగా కనిపిస్తుంది. కాని తెల్లనికాంతి కిరణాలంటూ లేవు. ఒక్కొక్క పదార్థం ప్రజ్వలించి నప్పుడు ఒక్కొక్క రంగుగల కిరణాలు వెలువడతాయి. మనం రోజూ తినే ఉప్పును ప్రజ్వలింపజేసినట్టయితే అది రెండు రకాల కాంతి తరంగాలను ఉత్పత్తి చేస్తుంది. ఈ రెండూ కూడా పసుపుపచ్చ, ఆకుపచ్చలు కలిసిన రంగులో ఉంటాయి.

సూర్యగోళంలో సమస్త పదార్థాలూ ప్రజ్వలిస్తూ ఉండటంచేత సూర్యకాంతిలో అన్ని రంగుల కాంతి తరంగాలూ కలిసి ఉన్నాయి. అన్నిటి వేగమూ ఒకటే గనక, అన్నీ ఒకేసారి భూమిని చేరి సూర్యకాంతి తెల్లగా ఉంటుందనే భ్రమను కలిగిస్తున్నాయి. కాని ఆ సూర్యకాంతినే మూడు పలకల "ప్రిజమ్‌లో"నుంచి పంపిపట్టయితే ఆ ప్రిజమ్ సూర్యకాంతిలోని రంగురంగుల తరంగాలను వేరుచేసి చూపుతుంది. అప్పుడు మనం ఇంద్రధనుస్సులో ఉండే రంగులన్నిటినీ చూడగలుగుతాం. వీటిలో ఒక చివర ఎరుపూ, దాని పక్కనంగపండురంగూ, దానిపక్కన పసుపుపచ్చా, దాని పక్కన ఆకుపచ్చా, దానిపక్కన నీలం, దానిపక్కన నీలిరంగూ, దాని పక్కన ఊదారంగూ కనిపిస్తాయి.

సూర్యకాంతిలో కంటికి కనబడే కిరణాలే గాక, కంటికి కనబడనిని ఎరుపుకు దిగువనా, ఊదాకు ఎగువనా ఎంతో దూరం ఉన్నాయి. వాటిని మన కన్ను చూడలేదుగాని, ఫొటోగ్రాఫులో కనిపిస్తాయి. సూర్యకాంతిని విడగొట్టి కిరణాలను పరిచినప్పుడే ఇంద్రధనుస్సు వస్తుంది. సూర్యకాంతి మబ్బులలోనుంచి ప్రసారమైనప్పుడు మబ్బులలోని నీటి కణాలు రంగులను విడగొట్టుతాయి. అందుచేత మనం ఆకాశంలో ఇంద్రధనుస్సును చూస్తాం. శాస్త్రజ్ఞులు ఇంద్రధనుస్సును "స్పెక్ట్రమ్" లేక వర్ణమాల అంటారు.

వర్ణమాలలను పరిశీలించటానికి శాస్త్రవేత్తలు వాడే పరికరాన్ని "స్పెక్ట్రాస్కోప్" అంటారు. దీని సహాయంతో నక్షత్రాలనూ, గ్రహాలనూ పరిశీలించి వాటిలో ఏ యే పదార్థాలున్నదీ శాస్త్రవేత్తలు తెలుసుకోగలుగుతున్నారు.

ప్రజ్వలించే పదార్థం రంగురంగుల కిరణాలను ప్రసరిస్తుందని తెలుసుకున్నాం. ప్రజ్వలించని వస్తువులు కూడా మనకు రంగు రంగులుగా కనిపిస్తాయి కదా దానికేమిటి కారణం? గోడకుకొట్టిన సున్నం తెల్లగా ఉంటుంది, బొగ్గు నల్లగా ఉంటుంది, చెట్ల ఆకులు ఆకుపచ్చగా ఉంటాయి, పూలు అన్ని రంగులలోనూఉంటాయి. దీనికి కారణమేమంటే స్వయం ప్రకాశంలేని వస్తువులపైన సూర్యకాంతి పడినప్పుడు ఆ వస్తువులు సూర్య కిరణాలలో నుంచి కొన్ని రంగుల కిరణాలను పీల్చుకొని మిగిలిన రంగులను ప్రతిఫలిస్తాయి. గోడకు కొట్టిన సున్నం అన్ని రకాల సూర్యకిరణాలనూ ప్రతిఫలిస్తుంది కనక తెల్లగా కనిపిస్తుంది. బొగ్గు అన్ని రకాల సూర్యకిరణాలనూ పీల్చుకుని దేనినీ ప్రతిఫలించదు గనక నల్లగా కనిపిస్తుంది. ఆకులు ఆకుపచ్చ కిరణాలను తప్ప మిగిలిన అన్నిటినీ పీల్చుకుంటాయి. అలాగే పూలు ఏ రంగుగా కనిపిస్తే ఆ రంగు కిరణాలను ప్రతిఫలించి మిగిలినవాటిని పీల్చుకుంటాయి. దీన్ని మనం సులువుగా రుజువు చేయవచ్చు. చెట్ల ఆకులపైన ఎర్రని కాంతి వేసి చూడండి, ఆకుపచ్చగా ఉండవలసిన ఆకులు నల్లగా ఉంటాయి. ఎందుచేత? ఆకు, ఆకుపచ్చని కాంతినిమాత్రమే ప్రతిఫలిస్తుంది. ఎర్ర కాంతిలో ఆకుపచ్చ కిరణాలుండవుగద! ఎర్ర కిరణాలను ఆకులు పీల్చేస్తాయి. అందుచేత ఎర్ర కాంతిలో ఆకులు నల్లగా మాత్రమే కనిపిస్తాయి.

ఆకాశం పగటివేళ నీలంగా కనబడటానికి కారణం ఏమంటే సూర్యకాంతిలోని నీలి కిరణాలను ఎత్తున ఉండే గాలిపొరలు అన్నిదిక్కులకూ చెదర గొట్టుతాయి. మనం ఆకాశంలోకి కొన్నివందల మైళ్ళు వెళ్ళి చూసినట్టయితే పట్టపగలు కూడా ఆకాశం నల్లగానే కనిపిస్తుంది. అందులో చుక్కలు కూడా కనిపిస్తాయి. గాలిపొరలు చెదరగొట్టే నీలికిరణాల కాంతి మూలాన్నే మనం పగలు చుక్కలను చూడలేకుండా ఉన్నాం.

మనం ఒక్కవిషయం స్పష్టముగా తెలుసుకోవాలి. రంగులన్నీ కిరణాలకే ఉంటాయి. కిరణాలు ప్రజ్వలించే స్వయం ప్రకాశక పదార్థాలనుంచి మాత్రమే వెలువడతాయి. స్వయంప్రకాశకాలు కాని వస్తువులకు స్వతహాగా రంగులంటూ లేవు. బయటినుంచి వచ్చి తమపైనపడే కిరణాలలో ఏ రంగుకిరణాలను ప్రతిఫలించగలిగితే ఆ రంగులో ఆ వస్తువు కనిపిస్తుంది.

ప్రపంచమంతా భ్రమ అనీ మన జ్ఞానేంద్రియాలు మనకు భ్రమలు పుట్టిస్తాయనీ తాత్వికులు చెప్పేమాట స్వయం ప్రకాశం కాని వస్తువుల రంగు విషయంలో పూర్తిగా నిజం, కొన్ని స్వయం ప్రకాశంగల వాటి విషయంలో పూర్తిగా నిజంకాదు.

1958 డిసెంబరులో జరిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయ నాటక పోటీలలో ఉత్తమవిద్యార్థి దక్కుకుడుగా బహుమతి పొందిన చీరాల కాలేజి విద్యార్థి పి.యల్. నారాయణ

అమాయక

'చందర్'

పాపాయి నెత్తుకుని
భావిదగ్గరకెళ్ళి
"పడవేయనా పాప?
భావిలో"నని పలుక
బట్టలన్నీ తడిపి
పాడుజేసితినంటె
అమ్మ కొడుతుందేమొ?
పడవేయ నద్దనును
వూళ్లోన ఒకరోజు
పెళ్ళి జరుగుతు ఉండ
పెళ్ళిలో వింతలను
వెళ్ళి చూసిన పాప,
నేనుకూడా పెళ్ళి
చేసుకుంటానంటు
అమ్మదగ్గరకెళ్ళి
మారాము చేయును.
నీళ్లోసుకోమంటే
మళ్ళి పరుగెడుతుంటి
నెట్లాగె నీతోటి
వేగేది నేనంటె
పొద్ద పొద్దాక నీ
ళ్ళొద్దు నా కికనుండి
అన్నిరోజుల నీళ్ళు
ఆనాడె పోయమను
డబ్బులన్నీ తీసి
దిబ్బలోబేశావు
డబ్బులేకుంటె మన
కిబ్బంది కాదంటె,
డబ్బులైపోగానే
రాళ్ళన్ని పోగేసి
ఆడుకుంటా నేను
ఇబ్బంది ఏమిటను.
అద్దమున నీనంటి
ముద్దుపాపుందంటె
"ఇద్దే" చూసిద్దునని
అద్దమును తీసికొని
ముద్దులొలికేనన్న
మొద్దుతో పోల్చకని
అద్దమును విసిరేసి
బ్రద్దలుగ జేయును.

పాపాయ్ ప్రశ్నలు

"అమ్మా పాపాయ్ పాకీమనిషిని
దోవనుపస్తూ తాకివచ్చినది
మైలపడ్డదిది నీళ్ళుపొయ్యి-వే"
అని 'బా'మ్మతోచాడీ చెప్పగ
పాపాయ్ మాతిని బుంగగపెట్టి
అమ్మను అడిగెను ఏమీ
తెలియక!

"పాకీమనిషిని ముట్టిన మైలా?
ఎందుకుచెప్పవనీళ్లిపొయ్యడం"
"తప్పే పాపా పాకీమనిషి
చేసేపని నువ్ చూడలేదటే
పాకీదొడ్లను బాగుచేసి అది
మైలపడినదని తాకరుఎవరూ!"
"అదేమిటమ్మా అల్లా అంటావ్
పాపాయ్ ఇంటో బైలుకు నెళ్ళే
ఎత్తేస్తావే అమ్మవు నువ్వు
ఇందరి మైలను ఎత్తేసేదది
అమ్మేకాదా మనకందరికీ!"
అమ్మ చెప్పనా బ్రహ్మ చెప్పనా
యక్ష ప్రశ్నల సారమెరింగిన
ధర్మరాజులే దిగిరావాలా
మనుషుల మచ్చలు
తుడిచేయంగా.

— పల్లూరి కమల

పామర్రులో నాటికల పోటీలు

పామర్రు, జనవరి 30

పామర్రులో జనవరి 7వ తేదీనుండి 11వ తేదీవరకు నాటికల పోటీలు జరిగాయి. ఉయ్యూరు, శ్రీరవికళానికేతన్, పామర్రు సర్వోదయ ఆస్థిమేటరు, లక్ష్మీపురం కళోదయ నాట్యమండలి, తేలప్రోలు ప్రజానాట్యమండలి, బందరు జనతా నాట్యమండలి, కృష్ణాపురం ప్రజానాట్యమండలి, విజయవాడ వి. ఏ. డి. అసోసియేషన్, బందరు రవి ఆర్ట్స్ అమెచ్యూర్సు అసోసియేషన్, పెడన ఫ్రెండ్సు ఆర్ట్స్ అసోసియేషన్, విజయా ఆర్ట్స్సు డ్రామెటిక్ అసోసియేషన్ వారు నాటికలను ప్రదర్శించారు.

సంతకు

— ఎ. వి. యస్. ఆర్. జోశ్యులు

ఉక్కు కవచం

శ్రీ యం. గోపాలరెడ్డి

(గత సంచిక తరువాయి)

మహావీర్ బ్రహ్మాండమయిన మర్రిచెట్టుదగ్గర కొచ్చాడు. వేలాడే మట్టి పూడ సహాయంతో చెట్టెక్కాడు. భటులు మర్రిచెట్టుక్రిందికి వచ్చి కాగడాలతో నలుదిక్కులా చూడసాగారు.

"వీడ్కి ఏక్కడికెళ్ళాడబ్బా. అదుగో గుర్రంఅక్కడేవుంది. వాడు యిక్కడే ఎక్కడో దాక్కొని వుంటాడు" అన్నాడొక భటుడు. భటులంతా అటూ యిటూ వెదకసాగారు. ఒక భటుడు అప్రయత్నంగా చేతులో వున్న కాగడా పైకెత్తి చెట్టుపైవున్న మహావీర్‌ను లీలగా పసికట్టాడు. మహావీర్ ఒక్కసారే అవాంతరి పూపట్టుకుని పూగులాడుతూ భటుడుకూర్చున్న గుర్రంమీదకుదూకి భటుణ్ణి క్రిందికి నెట్టేసి గుర్రాన్ని అదిలించాడు. గుర్రం వేగంగా పరుగెత్తసాగింది. రెండుక్షణాల్లో గుహను సమీపించాడు.

గుర్రాన్ని బయటే వదిలి గుహలో ప్రవేశించాడు. గుహలో రుద్రపాలుడు బంగారు నాణేలు లెక్కపెడుతున్నాడు.

"ఏం మల్లన్నా మొత్తం ఎన్నివున్నాయ్" అన్నాడు మహావీర్ నవ్వుతూ.

రుద్రపాలుడు ఆశ్చర్యంగా వెనుదిరిగి "మీరాఁవర్దార్! నేనింకెవరో అనుకున్నాను" అన్నాడు.

"మొత్తంలెక్కపెట్టావా" అన్నాడు మహావీర్.

"లెక్కపెట్టాను సర్దార్. మొత్తం ఐదువేలున్నాయి. అసలు మొత్తం మన దగ్గరున్ని నాణేలుంటాయి?" అని ప్రశ్నించాడు రుద్రపాలుడు.

మహావీర్ రెండు క్షణాలు ఆలోచించి "మొత్తం, నగలూ, వజ్రాలూ, నాణేలూ అన్నీ కలిపి యనభై ఆరువేల నాణేలుంటాయి" అన్నాడు.

మహావీర్ సొరంగ మార్గంగుండా ఉక్కుకవచం వుండే గదిదగ్గర కెళ్ళి రెండుసార్లు చప్పట్లు కొట్టాడు. నల్లటి బలాఢ్యుడైన వ్యక్తి మహావీర్ ఎదుటగా నిలబడ్డాడు. "మాటే సూసే" అన్నాడు మహావీర్. నల్లటివ్యక్తి పెద్ద తాళంచెవి నెత్తిని పెట్టుకునివచ్చి గదితాళం తెరిచాడు. మహావీర్ గదిలోకి వెళ్ళి ఉక్కుకవచం తీసి మంచంమీద పెట్టేసి మళ్ళా ముసుగుకప్పేసి సొరంగ మార్గంగుండా గుహలోకి వచ్చాడు.

రుద్రపాలుడు మంచంమీద పడుకుని ఉక్కుకవచాన్ని ఎలా మాయం చెయ్యాలా అని ఆలోచించసాగాడు.

"ఏంటి మల్లన్నా ఏంటో దీర్ఘంగా ఆలోచిస్తున్నావే"అన్నాడు మహావీర్.

"అబ్బే ఏమేంలేదు సర్దార్. అశ్వనీపురం కోటలో ఎలా ప్రవేశించడమా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు రుద్రపాలుడు.

"ఆ కోట సంగతి నీకెలా తెల్సు. అక్కడేమయినా ధనం నగలూ వున్నాయా" అన్నాడు మహావీర్.

"అశ్వనీపురం మహారాజు కుటేరుడి రమ్ముడు. కాబట్టినంత ధనం వుంది" అంటూ రుద్రపాలుడు నిండా దుప్పటి కప్పుకున్నాడు.

మర్నాడు చీకటిలోనే ఎవ్వరికీ చెప్పకుండా మహావీర్ ఏదో పనిమీద వెళ్ళాడు. రుద్రపాలు డొక్కడే గుహలో కూర్చుని దీర్ఘంగా ఆలోచించాడు. ఎలాగయినా ఉక్కుకవచాన్ని స్వాధీనం చేసుకోవాలి. మహావీర్‌నూ, అతని అనుచరులందర్నీ బంధించాలి అనుకున్నాడు.

త్వరత్వరగా సొరంగ మార్గంగుండా వుక్కు కవచం వున్న గదిదగ్గర కెళ్ళాడు. రెండుసార్లు చప్పట్లు కొట్టగానే నల్లటివ్యక్తి వచ్చాడు.

"మాటేసూసే" అనగానే నల్లటి వ్యక్తి పెద్ద తాళంచెవి నెత్తిన పెట్టుకునివచ్చి గదితాళం తెరిచాడు. రుద్రపాలుడు గదిలో ప్రవేశించి ముసుగు తొలగించి వుక్కుకవచం తీసుకుని ధరించాడు. త్వరత్వరగా అంగలేసుకుంటూ సొరంగ మార్గాన గుహలోకి వచ్చాడు. "ఏం సర్దార్ యివాళ పగలే బయలుదేరాలే" అన్నారు అక్కడ కూర్చుని మాట్లాడుకుంటున్న దొంగలు. రుద్రపాలుడికి గుండెల్లో దడదడ మంటూనే వుంది. అయినా ధైర్యంగా "కొంచెం పని వుంది" అన్నాడు కంఠం మహావీర్‌లా అనునయిస్తూ. త్వరత్వరగా నడుచుకుంటూ మొదటతను గుర్రాన్ని దాచిన స్థలాని కొచ్చాడు. గుర్రం అక్కడనే వుంది.

గుర్రం ఎక్కి గాలికంటే వేగంగా అశ్వనీపురంవైపు పోసాగాడు. రుద్రపాలుడు మధ్యాన్నానికల్లా అశ్వనీపురం చేరుకున్నాడు. కోటలో వున్న మహారాజువద్ద కెళ్లి కవచాన్ని మహారాజుకు అప్పజెప్పాడు. కొంచెంసేపు మహారాజుతో మాట్లాడి అక్కడ తన పని చక్కబెట్టుకుని వుక్కుకవచం వేసుకుని మళ్ళీవల్లకొండలవైపుకు ప్రయాణమయ్యాడు. సాయంత్రానికల్లా నల్లకొండలు చేరుకున్నాడు. రుద్రపాలుడు తన గుర్రాన్ని ఎప్పటి ప్రదేశంలోనే దాచిపెట్టి వేగంగా కొండ గుహను సమీపించాడు.

త్వరత్వరగా సొరంగమార్గంగుండా వుక్కు కవచం వుండే గదిదగ్గర కెళ్ళి రెండుసార్లు చప్పట్లు కొట్టాడు. నల్లటి వ్యక్తి రాగానే "మాటేసూసే" అన్నాడు. నల్లటి వ్యక్తి పెద్దతాళం చెవి నెత్తినపెట్టుకుని వచ్చి తాళం తెరిచాడు. కవచాన్ని మంచంమీదనే పెట్టేసి వాకిలివరకూ రాగానే, తాను కవచంపై ముసుగు కప్పలేదనే విషయం జ్ఞప్తికొచ్చి మళ్ళా ఎప్పటిమాదిరే ముసుగు కప్పేసి సొరంగమార్గంగుండా గుహలోకి వచ్చాడు. "సర్దార్! మహావీర్ ఎక్కడ? యింకా రాలేదా" అన్నాడు రుద్రపాలుడు ఏమీ ఎరగనట్టు.

"పొద్దున్నే వుక్కు కవచం వేసుకుని వెళ్ళాడే" అన్నాడు రుద్రపాలుడు ఆశ్చర్యంగా.

కొంచెం సేపట్లోనే మహావీర్ గుర్రం మీద అక్కడికొచ్చాడు. గుర్రాన్ని బయటేవదిలి గుహలోపలికి వచ్చాడు.

"అరే ఏంటి మీరంతా చీకట్లో కూర్చున్నారు. వెలిగించండి కాగడాలు" అన్నాడు మహావీర్. యిద్దరు దొంగలు రెండు కాగడాలు వెలిగించుకొచ్చారు.

"సర్దార్ యివాళంతా మీరెక్కడికెళ్ళారూ?" అన్నాడు రుద్రపాలుడు.

"నేనా. అశ్వనీపురం వెళ్ళాను" అన్నాడు మహావీర్.

అశ్వనీపురం వెళ్ళాను అని మహావీర్ అనగానే రుద్రపాలుడి గుండెల్లో రాయిపడింది. ముచ్చటలు పోయసాగాయి.

"ఎందుకూ" అన్నాడు వొణకే కంఠంతో.

"రాత్రి నువ్వు చెప్పలా. కోటలో ధనం చాలావుందని కోట రహస్య ద్వారాలు తెల్సుకుందామని వెళ్ళాను. కోటలోకి వెళ్ళి అన్ని ద్వారాలూ, ఖజానాచూసి వచ్చాను" అన్నాడు మహావీర్.

పట్టపగలు కోటలో ప్రవేశించి ఖజానా దగ్గర కెలావెళ్ళాడబ్బా అనుకుని "మరి కోటలోకి ఏలా వెళ్ళారు సర్దార్" అన్నాడు రుద్రపాలుడు.

"మొదట ఒక జ్యోతిషుని వేషం వేసుకుని కోటలో ప్రవేశించాను. చెతుక్కుంటూ సేనాపతి గదిలో ప్రవేశించి, మత్తుమందు సహాయంతో అతనికి స్పృహలేకుండాచేసి అతనిదుస్తులు నేను వేసుకున్నాను. కోటద్వారాలు ఖజానా అన్నీ చూసి రాజుగారితో కలిసి మాట్లాడి గజదొంగ మహావీర్ సామాన్యుడు కాడండీ మహారాజా జాగ్రత్తగా వుండాలి అని చెప్పి మరీకచ్చాను" అన్నాడు మహావీర్. మహావీర్ తెలివితేటలు చూస్తుంటే రుద్రపాలుడికి ఆశ్చర్యం కలగసాగింది. ఒకవేళ కోటలో తనను చూశాడేమో ననుకుని–

"మరి కోటలో యింకా విశేషాలేంటి" అన్నాడు.

"మహారాజు మనల్ని పట్టుకోవాలనే ప్రయత్నంలో వున్నాడు. ఎవడో రుద్రపాలుడటు. మనల్ని బంధించడానికి వాణ్ణి పంపాడటు. వాడేగనక కంటబడితే ముక్క ముక్కలుగా నరికి పెట్టెలోపెట్టి రాజుగార్కి కానుకగా పంపనూ" అంటూ మహావీర్ రుద్రపాలుడు భుజంమీద చెయ్యివేశాడు. రుద్రపాలుడు గడగడ వణకసాగాడు. తన అసలు సంగతి కనుక్కునే తన భుజంమీద చెయ్యివేశాడని రుద్రపాలుడు భయపడ్డాడు.

"మరి రుద్రపాలు డెక్కడున్నాడు సర్దార్" అన్నాడు రుద్రపాలుడు.

"అదికాదోయ్ మల్లన్నా. అసలు ఆరుద్రపాలుడనేవాణ్ణి నువ్వేఅవుదోనంపేశానన్నావే. మళ్ళీ వాడు ఎలా బ్రతికి మనకోసం బయలు దేరాడూ!" అన్నాడు మహావీర్.

"నిజంగా నేనుఆరోజు రుద్రపాల్నుణ్ణి చంపేశాను సర్దార్. మళ్ళా వీడు యింకో రుద్రపాలుడు కావచ్చు" అన్నాడు రుద్రపాలుడు.

"కావచ్చు మల్లన్నా! యివాళ అర్ధరాత్రికే మనం అశ్వనీపురం కోటలో ప్రవేశించాలి. సరేముందు భోంచేద్దాం. బాగా ఆకలవుతుంది" అంటూ మహావీర్ భోజనాల గుహవైపు నడిచాడు.

"అమ్మయ్య" అని మనసులోనే నిట్టూర్చుకొనిరుద్రపాలుడుమహావీర్‌ను అనుసరించాడు. యిద్దరూ తృప్తిగా భోంచేశారు. యిద్దరూ కొంచెంసేపు నిద్రపోయారు. మహావీర్ తెలుముందుగా లేచి "మల్లన్నా లే. అర్ధరాత్రయింది. వెళ్ళి నీ దుస్తులు అవీ వేసుకో" అన్నాడు. రుద్రపాలుడు లేచాడు.

మహావీర్ సొరంగమార్గం గుండా వుక్కు కవచం వుండే గదిదగ్గర కెళ్ళి రెండుసార్లు చప్పట్లు కొట్టాడు. నల్లటి వ్యక్తి మహావీర్ ముందుకు వచ్చాడు. "మాటేసూసే" అన్నాడు మహావీర్. నల్లటి వ్యక్తి పెద్దతాళం చెవి నెత్తినపెట్టుకుని వచ్చి గదితాళం తెరిచాడు. మహావీర్ గదిలో ప్రవేశించాడు. ముసుగు తొలగించి మంచం మీది వుక్కు కవచాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. గత రాత్రి వుక్కు కవచాన్ని సరిగ్గా నడిమంచం మీద పెట్టాడే మరి ఒక ప్రక్కకు ఏలా జరిగిందబ్బా అనుకున్నాడు. అనుమానంగానే కవచాన్ని ధరించాడు. బయటవున్న నల్లటివ్యక్తి వైపొకసారి సందేహంగామాసి సొరంగ మార్గం గుండా గుహలోకి వచ్చాడు. రుద్రపాలుడు దుస్తులు ధరించి సిద్ధంగా వున్నాడు.

"మల్లన్నా. నా వుక్కు కవచంవుండే గదిలోకి ఎవరో ప్రవేశించారు. అన్నాడు మహావీర్. రుద్రపాలుడి ప్రాణాలు పైపైనే పోసాగాయి. తమ గదిలోకి ప్రవేశించిన సంగతి ఆ నల్లటివ్యక్తి చెప్పాడేమోననుకుని "నిజంగానా. ఎవరుపోయారట" అన్నాడు రుద్రపాలుడు.

"ఏమో నా కెలా తెలుస్తుంది" అన్నాడు మహావీర్.

"గది కాపలాకాసే ఆ నల్లటివ్యక్తి చెప్పలేదా" అన్నాడు రుద్రపాలుడు.

"వాడు ఆకారానికి మాత్రమే సేవకుడు. వాడికి జ్ఞాపకశక్తి అసలేలేదు. దానికితోడు అసలే మూగ. ఎప్పటి సంగతులు అప్పుడే మర్చిపోతాడు. యిది వాడేలా చెప్పగలడు. ఒకవేళ నువ్వేమయినా వెళ్ళావా" అన్నాడు మహావీర్.

"అబ్బే నేనసలు ఆ గదివైపు వెళ్ళనే లేదే" అన్నాడు రుద్రపాలుడు.

"మరయితే ఎవడో ఆ రహస్య సంకేతం వినివుంటాడు. కురి ఆ వెళ్ళిన వాడు ఆగదిలో ఏంచేసినట్టు. కవచం గదిలో చెక్కుచెదరకుండా వుంది" అన్నాడు మహావీర్.

"ఆ సంగతులన్నీ రేపుపగలు ఆలోచించుకోవచ్చులే. ఇక మనం బయలుదేరదాం సర్దార్. మరి మన అనుచరులందర్నీ సిద్ధంకమ్మనిచెప్పి వచ్చేదా" అన్నాడు రుద్రపాలుడు.

"సరే వెళ్ళిరా మల్లన్నా. తాళ్ళూ, నిచ్చెనలూ, సిద్ధం చెయ్యమను" అన్నాడు మహావీర్.

రుద్రపాలుడు వెళ్ళి పద్దెనిమిదిమంది దొంగల్ని లేపాడు. దొంగలంతా కత్తులూ, తాళ్ళూ, నిచ్చెనలు తీసుకుని సిద్ధమయ్యారు. ఇరవైగుర్రాలూ అశ్వనీపురం కోటవైపుకు పరుగెత్తసాగాయి.

• • •

ముందు గుర్రంమీద ఒక దొంగ కాగడా పట్టుకుని పోతున్నాడు. తర్వాత మహావీర్, తర్వాత రుద్రపాలుడూ, అతని వెనక మిగతా దొంగలు. రుద్రపాలుడు తన గుర్రాన్ని దాచిపెట్టిన గుహముందునుంచే వాళ్ళంతా పోసాగారు. కాగడాల వెలుతురూ, గుర్రం అడుగుల చప్పుడూ విని, గుహలోవున్న రుద్రపాలుడి గుర్రం పెద్దగా సకిలించింది. గుర్రం సకిలింపువిని యిరవైగుర్రాలూ ఒక్కసారే ఆగిసోయాయి. రుద్రపాలుడికిమాత్రం భయంభయంగానేవుంది. "సర్దార్ అదేదో దయ్యం అరుపులా వుంది. పదండిపెళ్ళిపోదాం" అన్నాడు రుద్రపాలుడు. "పల్లన్నా అది దయ్యంఅరుపులాలేదు.అది తప్పకుండా గుర్రమే. అర్ధరాత్రి ఈ కొండల్లో గుర్రం అరుపు ఏమిటి? యిదంతా చిత్రంగావుంటే" అంటూ మహావీర్ చేతులో కాగడాలో, గుహలోవున్న గుర్రంవద్ద కొచ్చాడు. రుద్రపాలుడు ఆశ్చర్యాన్ని అభినయిస్తూ "అరే యిది రుద్రపాలుడి గుర్రం. మొన్న నేను వాణ్ణి పంపేశాను. మరివాడి గుర్రం యిక్కడి కెలా వచ్చిందబ్బా" అన్నాడు.

"మరి రుద్రపాలుడి కేదం ఎక్కడ" అన్నాడు మహావీర్.

"శవాన్ని ఏ పడుములో తీసేసి వుంటాయ్. పదండి. మనం మళ్ళీ తెల్లవారుఝామునకు ముందుగానే తిరిగి పోవాలి" అన్నాడు రుద్రపాలుడు.

మహావీర్ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూనే గుర్రం కళ్ళాలు కొంచెం వదిలాడు.

గుర్రాలన్నీ నడిరాత్రికి అశ్వనీపురం చేరుకున్నాయి. పట్టణ పొలిమేరల్లోనే మహావీర్ కాగడాను ఆర్పివేశాడు. యిరవై గుర్రాలూ, నిశ్శబ్దంగా నడుస్తున్నాయి. పట్టణంలో రాత్రిపూట గస్తీతిరిగే యిద్దరూ భటులు గుర్రాల్ని చూసి దగ్గరకు వచ్చారు.

"ఎవరు మీరు? అర్ధరాత్రి బజ్జాలెంట తిరుగుతున్నారు. ముందు కోటలోకి పదండి" అన్నాడు ఒకభటుడు.

మహావీర్ తన అనుచరుల వైపు చూస్తూ కనుమైగ చేశాడు. అమాంతం ముగ్గురు దొంగలు, భటులపైబడి వాళ్ళను బంధించివేశారు.

యిరవైమందీ గుర్రాలుదిగి కళ్ళాలు చేత్తో పట్టుకుని గుర్రాన్ని నడిపించుకుంటూ కోటవద్ద కొచ్చారు. గుర్రాల నన్నిటినీ చెట్లచాటున నిలబెట్టి, కోట వెనకభాగం వైపుకు యిరవైమందీ వచ్చారు.

రుద్రపాలుడు తన చేతులోవున్న బలమైన పొడుగాటి త్రాడుకు ఒక వుచ్చు ముడివేసి చత్తుకర్రద్దీ కోట వైపుకు విసిరాడు. వుచ్చుముడి కోట గోడపైనవున్న రాయికి తగులుకుని బిగుసుకుపోయింది. రుద్రపాలుడు ఒకసారి త్రాడును లాగి చూశాడు. వొరలోవున్న కత్తితీసి నోట్లో పెట్టుకుని త్రాడు సహాయంతో కోటపైకి ఎగబ్రాకసాగాడు. అతని వెంటనే మహావీర్‌కూడా ప్రాకసాగాడు.

ఆలా యిరవైమందీ కోటపైకి చేరారు. అందరి ముఖాల్లో ఆయాసం స్పష్టంగా కన్పిస్తుంది. మహావీర్, తన అనుచరుడివద్దవున్న త్రాటి నిచ్చెన ఒక చోటకట్టి క్రిందికి జారవిడిచాడు. అంతా నిచ్చెన సహాయంతో క్రిందికి దిగారు.

"పల్లన్నా కోటలో ధనాగారం ఎక్కడుందో నాకు సరిగా జ్ఞాపకం లేదు. ఎలా యిప్పుడు. ఖజానాకోసం మనం వెతుక్కుంటూ కూర్చుంటే అవతల కోటలో భటులు మనల్ని పసిగట్టరచ్చు" అన్నాడు మహావీర్.

(మిగతా 4వ పేజీలో)

యల్. బి. ఫిలింస్‌వారి 'అనారి' హిందీ చిత్రంలో నూతన్.